క్లుప్తంగా

రోడ్డుపై చెత్తకుప్పలను తొలగించాలి

కాజులూరు: మండలంలోని తిప్పరాజుపాలెంలో రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ఏ ఒక్క ప్రాంతంలో డంపింగ్ యార్డ్ సదుపాయం లేకపోవడంతో స్థానికులు గృహాల్లోన్ని చెత్తను గ్రామ ముఖ ద్వారంలోని రోడ్డు పక్కన పారస్తున్నారు. పశువులు, కుక్కలు, కోళ్ల సంచారంతో రోడ్డు పక్కన పారవేసిన చెత్తకుప్పలు రోడ్లపైకి వస్తున్నాయి. క్రమేపీ రోడ్డుపై చేరిన చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తుందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. దానికి తోడు గ్రామస్తులు కొందరు రాత్రి సమయంలో రహదారులకు ఇరువైపులా బహిర్భూమికి వెళుతుండటంతో రోడ్లు అధ్వానంగా తయారై పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారవుతుందని దీంతో అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్త కుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రతి ఇంటా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా చుడాలని ప్రజలు కోరుతున్నారు.

300 మందికి కంటి వైద్య సేవలు



శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పేదల కంటి సమస్యలు పరిష్కరించేందుకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. పట్టణంలోని 20వ వార్డు గొల్లపుంత కాలనీకి చెందిన లంక పవన్ తేజ ఆధ్వర్యంలో సోమవారం ఆ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని చైర్‌పర్సన్ దుర్గారాణి ప్రారంభించారు. యువత ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడంపై పవన్‌తేజ్‌ను ప్రశంసించారు. శిబిరంలో 300 మంది కాలనీవాసులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో అవసరమైన వారికి మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గునిపే భూషణం, పేరూరి మాధవి, గుమ్మిలేరు శ్రీనివాస్, పిల్లి శివ, కనక వరాలు, పిన్నెడ్డి కృపావతి, విన్నకోటి వెంకటేశ్వరరావు, ఎగ్గాడి సతీష్, కొమ్మోజు నాగేశ్వరరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు



వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల దంతాలు పరీక్షిస్తున్న వైద్యుడు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో ద్రాక్షారామకు చెందిన భీమేశ్వర దంత వైద్యశాల అధినేత, దంత శస్త్ర చికిత్స వైద్య నిపుణుడు డాక్టర్ బచ్చు క్రాంతికుమార్ సోమవారం నేషనల్ డెంటిస్ట్ డే పురస్కరించుకుని ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మంది విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. పళ్లు పుచ్చిపోకుండా ఉండాలంటే ఆహారం నమిలేటప్పుడు రెండు వైపులా సమానంగా నమిలి మింగాలని సూచించారు. అవగాహన లోపంతో చాలామంది చిన్నారులు, పెద్దలు కూడా ఏదో ఓ పక్క మాత్రమే నమలడం చేస్తుంటారని, అందువల్ల ఆ పక్క దంతాలు అధిక ఒత్తిడికి గురి అయ్యి పుచ్చిపోవడం జరుగుతుందని అవగాహన కల్పించారు. అవసమైన విద్యార్థులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

123 మందికి వైద్య సేవలు



కోరుమిల్లిలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ చంద్రమౌళి

కపిలేశ్వరపురం: వాకతిప్ప పీహెచ్‌సీ పరిధిలోని కోరుమిల్లిలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా 123 మందికి వైద్య సేవలందించారు. శిబిరంలో వృద్ధులు, చిన్నారులను పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రమౌళి పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. శిబిరంలో ఎంపీహెచ్ఎస్ కామేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు సేవలందించారు.

నేడు పీఠంలో పౌర్ణమి పూజలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో మంగళవారం పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు. ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి) సోమవారం విలేకరులకు తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



కాజులూరులో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో మాట్లాడుతున్న కమిటీ పరిశీలకుడు లక్ష్మణ్

కాజులూరు: రాష్ట్రంలో సీఎం జగన్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వాటిని ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని దంగేరు ఎంపీటీసీ సభ్యుడు కొప్పిశెట్టి లక్ష్మణ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు గృహసారథుల కమిటీ పరిశీలకుడిగా నియమితులైన లక్ష్మణ్ కాజులూరులో కొత్తగా నియమితులైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సోమవారం సమావేశాలు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం జగనన్న పని చేస్తున్నారన్నారు. సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, వలంటీర్లతో సమష్టిగా పనిచేసి జగనన్న పథకాలపై ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దండంగి సరోజని, మండల గృహసారథుల కమిటీ కన్వీనర్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, సచివాలయ కన్వీనర్లు టేకుమూడి శ్రీనివాస్, కొండేటి శ్రీనివాస్, యాళ్ల సత్తిబాబు, రెడ్డి నాగేశ్వర్రావు, రేకాడి ఆదినారాయణ, మేడిశెట్టి సూరిబాబు, రాము, తలాటం వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులపై బండ

- గ్యాస్ ధరలు రూ.50 పెంచిన కేంద్ర ప్రభుత్వం
- రూ.1,130.50కు పెరిగిన గ్యాస్ ధర
- రెండు నియోజకవర్గాల్లో 1,47,342 గృహ కనెక్షన్లు



గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు

కపిలేశ్వరపురం: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచింది. దీంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క పెట్రోల్, డీజిల్ ధరలను తరచూ పెంచుతూ ఉండగా ఇప్పుడు గ్యాస్ ధరను పెంచింది. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ధరలు పెంచిన తీరు ఇలా...

2018లో 14.2 కిలోల గృహ సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ధర రూ.629 ఉండగా ఐదేళ్లలో రూ. 1,130.50 కి పెరిగింది. 2021 జూలై 1న రూ.863కి, ఆగస్టు 17న రూ.888, సెప్టెంబర్1న రూ.913కి, అక్టోబర్ 6న రూ.928కి పెరిగింది. 2022 మార్చి22న రూ.978కి, మే 7న రూ.1,028కి, మే 19న రూ.1,031.50కి, జూలై 6న రూ.1,081.50కి ధర పెరిగింది. ఇప్పుడు రూ.1,130.50కి చేరింది.

గ్యాస్ వినియోగం ఇలా...

మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో నాలుగు, రామచంద్రపురం నియోజకవర్గంలోని రామచంద్రపురం, ద్రాక్షారామలలో మూడు మొత్తం ఏడు హెచ్‌పీసీఎల్, ఐఓసీ, బీపీసీఎల్ తదితర గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వాటి పరిధిలో 1,47,342 గృహ కనెక్షన్లు ఉన్నాయి. నెలలో సరాసరి 1.05 లక్షల సిలిండర్లు సరఫరా చేస్తుంటారు.

దైనందిన జీవనంపై ప్రభావం



పెరిగిన గ్యాస్ ధరల ప్రభావం రోజువారీ జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నిత్యావసరమైన గ్యాస్‌పై భారం మోపడం సరైంది కాదు. పెట్రోల్ ధరలు తరచూ పెరుగుతున్నాయి. ఇప్పుడు గ్యాస్ ధరలను పెంచింది. మాలాంటి చిన్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందికి గురవుతాయి.

–శనివారపు రామతులసి, గృహిణి, పడమర ఖండ్రిక

కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలి



కేంద్ర ప్రభుత్వం తరచూ గ్యాస్ ధర పెంచుతోంది. దానివల్ల సామన్య ప్రజలపై తీవ్ర భారం పడుతోంది. ఆదాయాలు పెరగని పరిస్థితుల్లో గ్యాస్ ధరలను పెంచడంపై పునరాలోచించాలి. ధరలను తగ్గించాలి.

–కె.కృష్ణవేణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, మండపేట

ఫ్లెక్సీలు తొలగించాలంటూ ఫిర్యాదు

మండపేట: ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా మండంలోని కేశవరంలో ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగించాలని ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్ సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ పేరిట గ్రామంలో జాతీయ నాయకులు, మాజీ సీఎంల విగ్రహాలకు ముసుగులు వేసిన పంచాయతీ అధికారులు ఫ్లెక్సీలను మాత్రం తొలగించడం లేదన్నారు. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ అధికారులను కోరినప్పటికీ పట్టించుకోవడం లేదని, తీసేస్తామంటూ కాలయాపన చేస్తున్నారని ప్రసన్నకుమార్ పేర్కొన్నారు.

చోరీకి పాల్పడిన దుండగుల అరెస్ట్

డీఎస్పీ బాలచంద్రారెడ్డి



రికవరీ చేసిన సొత్తును ప్రదర్శిస్తున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ, ఎస్సై తదితరులు

రామచంద్రపురం: పట్టణంలో గత నెల 26న చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు చేసినట్లు రామచంద్రపురం డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. పట్టణ పోలీస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని అఫీషియల్ కాలనీకి చెందిన పోసిన వీరబాబు ఇంట్లో ఈనెల 26న దుండగులు తాళం పగలు కొట్టి 32 కాసుల బంగారం, రూ.2.50 లక్షల నగదు దొంగిలించారన్నారు. వీరబాబు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఎస్సై డి.సురేష్‌బాబు, సీఐ వి.దుర్గారావు నేతృత్వంలో రెండు బృందాలుగా ఏర్పడి చాకచక్యంగా చోరీదారులను గుర్తించామన్నారు. ఏలూరు జిల్లా ధర్మాజీగూడేనికి చెందిన చింతలపూడి జస్వంత్, ఖమ్మం జిల్లా మధిరకు చెందిన మాధగోని నాగతిరుపతిబాబు అలియాస్ లక్కీ ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించామన్నారు. సోమవారం తమకు అందించిన సమాచారం మేరకు కొత్తూరు జంక్షన్ వద్ద వీరిద్దరూ అనుమానాస్పదంగా ఉండటంతో పట్టుకుని ప్రశ్నించగా వారు చోరీకి పాల్పడిన వారిగా గుర్తించామన్నారు. వీరిద్దరు గతంలో దొంగతనాలు చేసి జైలు శిక్ష పడగా ఖమ్మం జైలులో పరిచయం ఏర్పడి విడుదలై చింతలపూడి, రామచంద్రపురంలలో చోరీకి పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి రామచంద్రపురంలో దొంగిలించబడిన బంగారం, నగదు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు చెప్పారు. దొంగలను త్వరితగతిన గుర్తించి కేసును ఛేదించిన సీఐ దుర్గారావు, ఎస్సై సురేష్‌బాబు, అడిషనల్ ఎస్సై కేపీవీఎస్ రామాచార్యులు, కానిస్టేబుల్స్ జగదీష్, అనిల్, హోంగార్డు మహేష్, రామకృష్ణలను జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

దాతల ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కూళ్ల పాఠశాల హెచ్ఎంకు ప్రింటర్‌ను అందజేస్తున్న దృశ్యం

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలకు దాతలు ఇస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కేవీవీ సత్యనారాయణ అన్నారు. పాఠశాలకు విశ్రాంత పీఈటీ చిట్టూరి కృష్ణారావు రూ.60 వేలతో పాఠశాలకు కంప్యూటర్, వైఫై, ప్రింటర్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోదరుడు చిట్టూరి రామ్మోహనరావు ప్రోద్బలంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేశానన్నారు. దాతలను పాఠశాలను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కుష్ఠురోగుల సమస్యలు పరిష్కరించాలి

కపిలేశ్వరపురం: కుష్ఠు వ్యాధిగ్రస్తుల సమస్యలను పరిష్కరించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు ధూళి జయరాజు కోరారు. అంగర పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం వ్యాధిగస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గృహ సముదాయాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తులకు గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్లాట్లను కేటాయించాలని, ఒక్కొక్కరికి 35 కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు సూరంపూడి సత్యనారాయణ, షేక్ నబీ, జల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోపు అర్జీలు పరిష్కరించాలి



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో సింధు సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం: ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని స్పందనకు వచ్చే ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోపు పూర్తిస్థాయిలో సంతృప్తికరంగా పరిష్కరించేందుకు కృషి చేయాని రామచంద్రపురం ఆర్డీవో పి.సింధు సుబ్రహ్మణ్యం డివిజనల్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో ఆర్డీవో పాల్గొని అర్జీలను స్వీకరించారు. మొత్తం 7 అర్జీలు రాగా అందులో పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు 2, విద్యాశాఖ 1, హౌసింగ్ 1, ఇరిగేషన్ 1, డివిజన్ పంచాయతీ 1, అగ్రికల్చర్ 1 మొత్తం 7 అర్జీలు వచ్చాయని ఆర్డీవో పేర్కొన్నారు. అర్జీలు పరిష్కరించేందుకు ఆయా శాఖలకు సిఫారసు చేసినట్లు చెప్పారు. డివిజన్ స్థాయి అన్ని శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి చిరునామా జగన్

కేశవరంలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎస్సీ ఎస్టీ బీసీ నాయకులు

మండపేట: సామాజిక న్యాయానికి నిలువెత్తు నిదర్శనం చిరునామా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మండలంలోని కేశవరానికి చెందిన ఎస్సీ ఎస్టీ బీసీ నాయకులు పేర్కొన్నారు. సీఎం జగన్ పాలనపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం గ్రామంలోని సొసైటీ కార్యాలయం వద్ద జగన్ చిత్ర పటానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు చంద్రమళ్ల రవిశాస్త్రి, సమతం పాపారావు, పినిపే శేఖర్, విన్నకోటి ప్రసాద్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో మాట ఇచ్చి నట్టుగానే ఎమ్మెల్యే సీట్ల కేటాయింపులు, మంత్రివర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, పాలనలో భాగస్వాములను చేశారన్నారు. అట్టడుగు కులాలకు సముచిత స్థానం కల్పిస్తూ కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 స్థానాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతుంటే ఏకంగా 14 స్థానాలను ఎస్సీ, బీసీలకు ఇవ్వడం బడుగు బలహీనవర్గాల వారి అభ్యున్నతి పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధతకు నిదర్శనమని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సభ్యులు గండిమేను గోవిందు, చుక్క శ్రీరాములు, చంద్రమళ్ళ అమల, గ్రామ రజక సంఘం అధ్యక్షుడు రేగులబంద మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సుకన్య పథకంపై అవగాహన మేళా

మండపేట: ఆడపిల్లలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు పోస్టల్ శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి యోజనను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి సూచించారు. సుకన్య పథకంపై పట్టణంలోని 27, 28 వార్డుల పరిధిలోని చిన మసీదు వద్ద సోమవారం మండపేట సబ్ పోస్టాఫీసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేళాకు చైర్‌పర్సన్ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పోస్టుమాస్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి ఈ పథకం గురించి వివరించారు. పదేళ్ల లోపు ఆడపిల్లలకు ఈ పథకం ద్వారా పోస్టాఫీసులో అకౌంట్ తెరవచ్చునన్నారు. ఏడాదికి కనిష్ఠంగా రూ. 250, గరిష్ఠంగా రూ. 1.5 లక్షల వరకు పొదుపు చేసుకోవచ్చునని వివరించారు. అనంతరం అకౌంట్లు తీసుకున్న వారికి పాస్ పుస్తకాలను చైర్‌పర్సన్ దుర్గారాణి పంపిణీ చేశారు. కౌన్సిలర్లు నీలం దుర్గ, మొండి భవాని, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మణ్ కుమార్, పోస్టల్ అసిస్టెంట్ కొండపల్లి సూర్యనారాయణ, సుందరపల్లి వెంకటరత్నం, పేకేటి మాణిక్యం, ఎండీఎం షరీఫ్, కె.ఈశ్వరరావు, సీహెచ్ శ్రీనివాస్, జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సేవకు పునరంకితమవుతా..

మంత్రి వేణు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వేదాశీర్వచనం అందుకుంటున్న మంత్రి వేణు

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ నాయకుడిగా, నియోజకవర్గ ప్రజలకు సేవకుడిగా తాను తిరిగి పునరంకితమవుతానని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. 2018 మార్చి 6న రామచంద్రపురం నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్‌గా మంత్రి వేణును ప్రకటించారు. మళ్లీ ఇదే రోజున తిరిగి పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి 2024లో తిరిగి వేణు రామచంద్రపురం నుంచి పోటీ చేస్తారని ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గానికి కో ఆర్డినేటర్‌గా 5 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి స్వీట్లు పంచారు. మంత్రి మాట్లాడుతూ కోఆర్డినేటర్‌గా, శాసనసభ్యుడిగా, మంత్రిగా ఈ నియోజకవర్గానికి సేవ చేసుకునే అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, పార్టీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అనిశెటి రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, పార్టీ నేతలు జుత్తుగ గులాంబాషా, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమేశ్వరుని దర్శించుకున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో సోమవారం 2024లో రానున్న ఎన్నికల్లో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అభ్యర్థిగా ఉంటారని ప్రకటించడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. ఆనందంతో ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. పలు సెంటర్లలో బాణసంచా పేల్చి సంబరాలు చేశారు. మంత్రి వేణు పార్టీ శ్రేణులతో కలసి ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నంది మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు.

8న సీజ్ చేసిన వాహనాలకు బహిరంగ వేలం

మండపేట: మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన మోటార్ సైకిళ్లకు డీఎస్పీ బాలచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 8వ తేదీ ఉదయం 9 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు రూరల్ ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. రూరల్ సీఐ శివగణేష్ సమక్షంలో వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని ఎస్ఐ శివకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

8న మెగా రక్తదాన శిబిరం

మండపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండపేటకు చెందిన వైశ్యా లేడీస్ వెల్ఫేర్ అసోసియేషన్, అమ్మ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్థానిక నాళం వారి సత్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరిగే శిబిరంలో అధిక సంఖ్యలో రక్తదాతలు పాల్గొని ప్రాణ దాతలు కావాలని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

9న మండపేటలో మెడికల్ అసెస్మెంట్ క్యాంపు



ఎం.సత్యనారాయణ

మండపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 9న మెడికల్ అసెస్మెంట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్షా సహిత విద్యా సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సోమవారం విలేకరులకు తెలిపారు. జిల్లాలోని సమగ్ర శిక్షలో భాగంగా ఉన్న సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.కమల కుమారి ఆధ్వర్యంలో ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 10న అమలాపురం బాలికల ఉన్నత పాఠశాలలో ఇదే విధమైన క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. దివ్యాంగ చిన్నారులకు వివిధ రకాల ఉపకరణాలను అందజేసే నిమిత్తం ఏర్పాటు చేసిన శిబిరంలో వీల్ చైర్స్, సీపీ చైర్స్, వినికిడి యంత్రాలు, ట్రై సైకిల్స్, చంక కర్రలు, వైట్ కేన్స్ స్టిక్స్, బీఐ కిట్స్, ఎంఆర్ కిట్స్ తదితర పరికరాలను అందజేసేందుకు ముందస్తు నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పసలపూడిలో బేటీ బచావో.. బేటీ పఢావో



పసలపూడిలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రాయవరం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పసలపూడిలో సోమవారం బేటీ బచావో-బేడీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఆ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన కార్యక్రమంలో బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన కలిగే దుష్ఫలితాలు, బాలికల అక్రమ రవాణా, పోక్సో చట్టం, దిశ చట్టం, గుడ్-బ్యాడ్ టచ్ తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో ఆడపిల్లల మీద జరుగుతున్న పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఎం.అంబేడ్కర్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ ఆయా అసోసియేషన్ కార్యదర్శి డి.ఆదిలక్ష్మి, పాఠశాల పీఈటీ అప్పారావు, సచివాలయ సిబ్బంది పాకా సౌజన్య, ఎస్.సౌజన్య ప్రియాంక తదితరులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ టి.భారతి, కె.సత్యవతి, కె.రాధాబాయి, డి.సుధాయామిని, డీవీఎస్ ప్రభ, ఆర్.విజయలక్ష్మి, పి.పార్వతి పాల్గొన్నారు.

బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా కృష్ణమూర్తి



నూతన కార్యవర్గం

కె.గంగవరం: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా మండల అధ్యక్షుడిగా కొల్లి కృష్ణమూర్తిని నియమించారు. కె.గంగవరం అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం జరిగిన బీఎస్ఐ కమిటీ సమావేశంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొల్లి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా అల్లంపల్లి రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంటపల్లి మధుబాబు, సహాయ కార్యదర్శిగా కొరమాటి శ్రీనివాస్, కోశాధికారిగా కూరాటి విశ్వనాథం, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంఘం అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

పనుల జాప్యంతో ఇక్కట్లు

మండపేట: ద్వారపూడి రోడ్డు అభివృద్ధి పనుల్లో జరుగుతున్న జాప్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. దాదాపు రెండు నెలలు క్రితం నిలిపివేసిన సీసీ రోడ్డు పనులను ఇంకా ప్రారంభించలేదన్నారు. తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాల్లో అసంపూర్తి పనులు, మెహర్ స్కూల్ వద్ద పనులు మొదలవ్వక ప్రజలు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు.

పీహెచ్‌సీకి వీల్ చైర్ అందజేత

రాయవరం: మండలంలోని మాచవరం పీహెచ్‌సీ ఆ గ్రామానికి చెందిన కొవ్వూరి గంగిరెడ్డి వీల్‌చైర్‌ను బహూకరించారు. పీహెచ్‌సీ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఉప సర్పంచ్ పడాల వసంత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి చేతుల మీదుగా వీల్‌చైర్‌ను పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్‌కు అందజేశారు. సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, పీహెచ్‌సీ చైర్మన్ మేడపాటి వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.